సాక్షి
మహబూబాబాద్
సోమవారం | 6 | మార్చి | 2023



ఎండు గంజాయి పట్టివేత

ఆటోలో తరలిస్తున్న ఎండుగంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. - 8లో▸



శాంతిభద్రతలు క్షీణించాయి

రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. ఆదివారం నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. - 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
38.9°/16.3°

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. కాస్త చలిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



నర్సింహులపేట: మండల కేంద్రంలోని ఇంద్రకిలాద్రి పర్వతంపై వెలసిన వేంకటేశ్వరస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి 7.20 గంటలకు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేద పండితులు కృష్ణచైతన్య చార్యులు, కేతనాచార్యులు, రామాచార్యులు, నందనాచార్యులు, కుమారాచార్యులు వేదమంత్రోచ్చరణల నడుమ వేడుకలను ప్రారంభించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా జెడ్పీ మాజీ చైర్మన్ మెరుగు సత్యనారాయణ, విమల దంపతులు వేంకటేశ్వరస్వామికి పట్టు, దీక్ష వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొల్లం రమేష్, ఈఓ వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ మార్క శేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీరన్న సన్నిధికి పోటెత్తిన భక్తులు



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత రభద్రస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. స్వామి, అమ్మవారిని దర్శించుకుని భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అభిషేకాలు, కల్యాణాలు, అన్నపూజలు చేసి భక్తిని చాటుకున్నారు.

గీత కార్మికులు ఐక్యంగా ఉండాలి



కురవి: గీత కార్మికులు ఐక్యంగా ఉండాలని, సర్వాయి పాపన్న స్ఫూర్తితో పని చేయాలని కల్లు గీత కార్మిక సంఘాల రాష్ట్ర చైర్మన్ బాలరాజుగౌడ్ అన్నారు. ఆదివారం కురవి వీరన్నను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయం ఎదుట మాట్లాడారు. కార్మికులు సామాజిక న్యాయం, అణచివేతకు వ్యతిరేకంగా సమస్యలపై పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ, కల్లుగీత కార్మిక సంఘాల రాష్ట్ర కన్వీనర్ ఐలి వెంకన్న, కల్లుగీత కార్మిక సంఘాల రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ యలికట్టె విజయ్‌కుమార్, నాయకులు కేశమోని శ్రీనివాస్, వెంకటన్న, గంధసిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వసతుల కల్పనకు వార్డుల పర్యటన



డోర్నకల్: ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో పర్యటిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న తెలిపారు. డోర్నకల్ మున్సిపాలిటీలోని తొమ్మిదో వార్డులో ఆదివారం కౌన్సిలర్ బోరగల్ల శరత్‌తో కలిసి పర్యటించి సమస్యల పరిష్కారం, వసతుల కల్పనపై స్థానికులతో చర్చించారు. వార్డుల్లో తాగునీటి వసతి, డ్రెయినేజీ, విద్యుత్ సౌకర్యం, సీసీ రోడ్ల నిర్మాణంపై దృష్టి సారిస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. వసతుల కల్పనకు సంబంధించి స్థానికుల అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు మారబోయిన రాంభద్రం, స్థానిక నాయకులు గండి రాము, సూర మధు, సాదనాల రాము, రెడ్డెబోయిన శ్రీనివాస్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టీఎస్‌పీఎస్సీ పరీక్షలు



హన్మకొండ అర్బన్: టీఎస్‌పీఎస్సీ నిర్వహిస్తున్న ఏఈ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 8,245 మంది అభ్యర్థులకు ఉదయం పరీక్షకు 6,522 మంది(79.10 శాతం), సాయంత్రం పరీక్షకు 6,483 మంది(78.63 శాతం) హాజరయ్యారని అధికారులు తెలిపారు. మొత్తం 14 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షలను అదనపు కలెక్టర్ సంధ్యారాణి పర్యవేక్షించారు.

సుఖ ప్రసవాలు

- జిల్లాలో పెరుగుతున్న నార్మల్ డెలివరీల సంఖ్య
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వసతులు
- గార్ల, గూడూరు ఆస్పత్రులకు రోగులతో పాటు గర్భిణుల తాకిడి



మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో బాలింతలు

సాక్షి, మహబూబాబాద్: ఆస్పత్రుల్లో సుఖ ప్రసవాలు జరగాలి. అప్పుడే తల్లీబిడ్డా క్షేమంగా ఉంటారు. మాతా, శిశు మరణాలు తగ్గుతాయి. ఈ మేరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సుఖ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకున్నారు. కాగా మహబూబాబాద్ జిల్లాలో మంచి ఫలితాలు ఇస్తున్నాయి. దీనికి తోడు మనుకోట ఆస్పత్రి ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ ఆస్పత్రిగా మారడంతో డాక్టర్లు, వసతులు పెరిగాయి. అలాగే నూతన విధానాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం పెరిగి, క్రమంలో ఆస్పత్రుల్లో రద్దీ పెరుగుతోంది.

70శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే..

గతంలో బిడ్డ కాన్పు సమయంలో తల్లిదండ్రుల్లో భయం మొదలయ్యేది. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తే వేల రూపాయల బిల్లులు చెల్లించాల్సిన పరిస్థితి. కానీ ప్రస్తుతం తల్లి గర్భంలో బిడ్డ పడిన నాటినుంచి ప్రసవం జరిగే వరకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఆశకార్యకర్తలు, ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్ల ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిపేందుకు అవగాహన కల్పిస్తున్నారు. పురిటి నొప్పులు రాగానే ఫోన్ కొడితే చాలు108, 104తో పాటు అమ్మ ఒడి వాహనాల ద్వారా ప్రభుత్వ ఆస్పత్రులకు తీసుకెళ్లే సౌకర్యం కల్పించారు. దీంతో 70శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరుగుతున్నాయి. జిల్లా ప్రధాన ఆస్పత్రి, గార్ల, గూడూరు ఆస్పత్రుల్లో కలిపి నెలకు సగటను 400లకు పైగా ప్రసవాలు జరుగుతున్నాయి.

2022 నుంచి ఇప్పటి వరకు వివరాలు

ఆస్పత్రి	నార్మల్	సిజేరియన్	మొత్తం
ప్రభుత్వం	2,674	6,698	9,372
ప్రైవేట్	84	911	995

సాధారణ ప్రసవం కోసం..

బిడ్డకు జన్మనివ్వడం తల్లికు పునర్జన్మ వంటింది. అయితే తల్లి సాధారణ ప్రసవం అయితే తల్లీబిడ్డకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవని డాక్టర్లు చెబుతున్నారు. దీనికి తోడు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకుంటున్నారు. సాధారణ ప్రసవాలు చేసేలా జిల్లాలోని ముగ్గురు మిడ్‌వైఫరీలకు ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు. కాగా జిల్లాలో 20శాతం సాధారణ ప్రసవాలు, 80శాతం సిజేరియన్ ప్రసవాలు జరిగేవి. కానీ ఇప్పుడు 49శాతం సాధారణ ప్రసవాలు జరగుతున్నాయి. అంటే ఇద్దరిలో ఒకరికి సాధారణ ప్రసవం చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇలా చేసినందుకు జిల్లా వైద్య బృందానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి పలుమార్లు ప్రశంసలు కూడా రావడం గమనార్హం.

నమ్మకం పెరిగింది..



గతంతో పోలిస్తే జిల్లాలోని మహబూబాబాద్, గార్ల, గూడూరు ఆస్పత్రులకు వచ్చేరోగులతో పాటు, గర్భిణుల సంఖ్య కూడా పెరిగింది. మొత్తం ప్రసవాల్లో 70శాతం ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరుగుతున్నాయి. వసతులు, డాక్టర్లు పెరిగారు. ప్రజలకు నమ్మకం పెరిగింది. ప్రైవేట్‌కు వెళ్లి డబ్బులు వృథా చేసుకోవడం లేదు.

-డాక్టర్ వెంకట్రాములు, జిల్లా ఆస్పత్రి ప్రసూతి విభాగం ఇన్‌చార్జ్

ప్రత్యేక నజర్

- గ్రీన్‌ల్యాండ్స్ పరిరక్షణపై దృష్టి
- మినీ చిల్డ్రన్స్ పార్కుల ఏర్పాటు
- ఆట వస్తువులకు జనరల్‌ఫండ్ నుంచి నిధుల కేటాయింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



36వ వార్డులో ఏర్పాటు చేసిన మినీ చిల్డ్రన్స్ పార్కు

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని గ్రీన్‌ల్యాండ్స్, ప్రభుత్వ భూముల రక్షణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మినీ చిల్డ్రన్స్ పార్కుల ఏర్పాటుకు మున్సిపాలిటీ శ్రీకారం చుట్టింది. ఆయా పార్కుల్లో పిల్లలు ఆడుకునేందుకు ఆటవస్తువులు ఏర్పాటు చేస్తున్నారు. ఆట వస్తువుల కోసం జనరల్ ఫండ్ నుంచి నిధులు కేటాంచారు. విలువైన భూముల రక్షణతో పాటు పిల్లల మానసికోల్లాసానికి మున్సిపాలిటీ చర్యలు తీసుకోవడంపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

70కి పైగా గ్రీన్‌ల్యాండ్స్..

మానుకోట మున్సిపాలిటీలో 70కిపైగా గ్రీన్‌ల్యాండ్స్ ఉన్నాయని టీపీఓ నవీన్‌కుమార్ తెలిపారు. ఆ స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. స్థలాల చుట్టూ ఫెన్సింగ్ చేసినా కబ్జాకు గురికావడం, ఇతర విషయాలను దృష్టిలో పెట్టుకుని ప్రజలకు ఉపయోగపడే నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని గ్రీన్‌ల్యాండ్లలో పార్కులు, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.

గతంలో చర్యలు..

గ్రీన్‌ల్యాండ్స్ పరిరక్షణలో భాగంగా గతంలో మానుకోట మున్సిపల్ అధికారులు 9ఓపెన్ జిమ్‌లు, 5 పార్కులు ఏర్పాటు చేశారు. ఎన్జీవోస్ కాలనీలో రూ.50లక్షలతో పార్కు నిర్మాణం చేపట్టారు. అలాగే ఇందిరగ్రౌండ్‌లో రూ.50 లక్షలతో త్రివర్ణ పార్కు, బ్రహ్మకుమారీస్ మందిరం సమీపంలో రూ.25లక్షలతో పార్కు ఏర్పాటు చేశారు. హౌజింగ్‌బోర్డు కాలనీలో రూ.12.50లక్షలతో, మహర్షి విద్యాలయం సమీపంలో రూ.60లక్షలతో పార్కు ఏర్పాటు చేసి విలువైన భూములకు రక్షణ కల్పించడంతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించారు. ఆయా పార్కుల్లో ఆట వస్తువులు, వాకింగ్‌ట్రాక్, అలంకరణ మొక్కలు, గ్రీనరీతో పాటు బెంచీలు ఏర్పాటు చేశారు.

స్థలాల పరిరక్షణ కోసం..

గ్రీన్‌ల్యాండ్స్, ప్రభుత్వ స్థలాల పరిరక్షణలో భాగంగా ప్రస్తుతం మినీ చిల్డ్రన్స్ పార్కుల ఏర్పాటు కోసం చర్యలు చేపట్టారు. ఆట వస్తువుల కోసం జనరల్‌ఫండ్ నిధులు సైతం కేటాయించారు. ఇటీవల 36వ వార్డు పరిధిలో రెండు పార్కులు ఏర్పాటు చేసి ఆట వస్తువులు అందుబాటులో ఉంచారు. 19వ వార్డులో బంధం చెరువు వద్ద, 23వ వార్డులో మసీద్ దగ్గర పార్కులు ఏర్పాటు చేశారు. రెండో వార్డులోని జమాండ్లపల్లి గ్రామంలో చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటు చేయాల్సి ఉంది. కాగా ఒక్కో పార్కులో ఆటవస్తువుల కోసం జనరల్ ఫండ్ నుంచి రూ 90,000 కేటాయించారు. కాగా మిగతా వార్డుల్లో సైతం మినీ చిల్డ్రన్స్ పార్కులు ఏర్పాటు చేసేందుకు కౌన్సిలర్ల ద్వారా వివరాలు సేకరిస్తున్నారు.

స్థలాలు ఉంటే ఏర్పాటు చేస్తాం

గ్రీన్‌ల్యాండ్స్‌తో పాటు తక్కువ గజాలు గల ప్రభుత్వ భూముల్లో మినీ చిల్డ్రన్స్ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. మానుకోట మున్సిపాలిటీలో మొదట ఐదు మంజూరు చేయగా నాలుగు పూర్తి అయ్యాయి. వార్డుల్లో ఇలాంటి భూములు ఉంటే కౌన్సిల్‌లో తెలియచేస్తే చైర్మన్, కమిషనర్ పార్కుల ఏర్పాటు విషయంలో నిర్ణయం తీసుకుంటారు.

-సీహెచ్ ఉపేందర్, డీఈ

మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి

మరిపెడ: మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ గుగులోతు సింధూర రవికుమార్ అన్నారు. మరిపెడలో ఆమె మాట్లాడుతూ.. దినదినాభివృద్ధి చెందుతున్న మున్సిపాలిటీలో రోడ్ల విస్తరణ తప్పనిసరి అన్నారు. పెరుగుతున్న రద్దీ కారణంగా రోడ్ల వెడల్పు ప్రజల అభిష్టం మేరకే చేస్తున్నామన్నారు. వ్యాపారులు ఇది గమనించాలని ఆమె కోరారు. మేజర్ గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మార్పు చెందిన మరిపెడ మరింత మెరుగులు దిద్దుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్‌లో రహదారుల విషయంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తుగా పక్కా ప్రణాళిక ప్రకారం టౌన్ ప్లానింగ్ అధికారులతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.

తెలంగాణ రైతులు దేశానికే ఆదర్శం

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



హచ్చుతండా శివారులో గోదాంను ప్రారంభిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు రూరల్: తెలంగాణ రైతులు భారత దేశానికే ఆదర్శమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని హచ్చుతండా శివారులో రూ.96.62 లక్షలతో నిర్మించిన 1,500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం, పీఏసీఎస్ కార్యాలయ భవనాన్ని ఆదివారం మంత్రి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్‌తో కలిసి మంత్రి మాట్లాడారు. అనేక రాష్ట్రాల్లో వ్యవసాయ ఉత్పత్తులు తగ్గాయని, తెలంగాణలో వ్యవసాయ ఉత్పత్తులు రాకెట్‌లా దూసుకెళ్తున్నాయన్నారు. గత ప్రభుత్వాల హయాంలో కొత్తగా గోదాముల నిర్మాణం జరిగిన దాఖలాలు లేవని, తెలంగాణలో గోదాములు నిర్మించుకుంటున్నామన్నారు. డీసీసీబీ రూ.12 కోట్ల లాభాల్లో ఉండడం అభినందనీయమన్నారు. తొర్రూరు పీఏసీఎస్‌లోని 10,031మంది రైతులకు ఇప్పటివరకు రూ.1.45 కోట్ల రుణాలు అందించడం గర్వకారణమన్నారు. పీఏసీఎస్ భవన నిర్మాణానికి డీసీసీబీ రూ.24 లక్షలు అందించడం ఆహ్వానించదగిందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, మున్సిపల్ రామచంద్రయ్య, హచ్చుతండా సర్పంచ్ సరస్వతి, స్థానిక పీఏసీఎస్ డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్



బహుమతి అందజేస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

మహబూబాబాద్ అర్బన్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం పోలీసు క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్పీ హాజరై మాట్లాడారు. ఉద్యోగులు ఒత్తిడి నుంచి ఉపశమనం పొందాలనే ఉద్దేశంతో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలీసులకు క్రికెట్ క్రీడలు నిర్వహించామన్నారు. ఫైనల్‌లో మహబూబాబాద్ సబ్ డివిజన్ జట్టు, జిల్లా డీపీఓ జట్టు పోటీపడగా మహబూబాబాద్ సబ్ డివిజన్ జట్టు గెలుపొందినట్లు తెలిపారు. అందరూ కష్టపడి క్రికెట్‌లో తమ సత్తచాటారని, క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. అనంతరం పోలీసు క్రికెట్ టీమ్‌లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ యంత్రాంగం తదితరులు పాల్గొన్నారు.

పెరిక సంఘం అభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మద్ద లింగయ్య

నెహ్రూసెంటర్: పెరిక కుల సంఘం అభివృద్ధికి సభ్యులందరూ కృషి చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్ద లింగయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం పెరిక కులస్తుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరిక కులస్తులు కలిసికట్టుగా ముందుకు సాగాలని సూచించారు. త్వరలో జరగనున్న సంఘం రాష్ట్ర మహాసభలకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. అనంతరం పెరిక సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా పాయిలి రాజేశ్వర్‌రావు, అధ్యక్షుడిగా ఆకుల హరిప్రసాద్, ఉపాధ్యక్షుడిగా ఆకుల రాము, కార్యదర్శిగా ముద్దసాని సురేష్, కోశాధికారిగా సాయిని అనిల్, ప్రచారకర్తగా అచ్చ రాజేష్, యూత్ అధ్యక్షుడిగా తావిశెట్టి రాకేష్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

8 వరకు ఫార్మసీ పరీక్షల ఫీజు గడువు

కేయూ క్యాంపస్: కేయూ బీఫార్మసీ(సీబీఎస్) మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలకు(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) రూ.250 అపరాధ రుసుముతో ఈనెల 8వ తేదీ వరకు గడువు ఉందని పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక ఆదివారం తెలిపారు. అలాగే ఎంఫార్మసీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలకు(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) రూ.250 అపరాధ రుసుముతో పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈనెల 8 వరకు గడువు ఉంది.

చెరువుపై చిన్నచూపు..!

- రామలింగప్ప చెరువులో ఇష్టారాజ్యంగా బావుల తవ్వకాలు
- తీవ్రంగా నష్టపోతున్న చేపల పెంపకందారులు
- వేసవిలో మూగజీవాల తాగునీటికి ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



చెరువులో తవ్విన బావులు

బయ్యారం: మండలంలోని ఉప్పలపాడు పంచాయతీ పరిధిలోని జనార్దనపురం గ్రామ సమీపంలోని రామలింగప్ప చెరువు కబ్జాదారుల పాలిట వరంగా మారింది. సమీపంలోని రైతులు ఇష్టానుసారంగా చెరువులో బావులు తవ్వుతున్నప్పటికీ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా సుమారు 30ఎకరాల చెరువు ప్రాంతం నేడు 10ఎకరాలలోపే ఉన్నట్లు పలువురు పేర్కొంటున్నారు. ఫలితంగా చేపల పెంపకందారులతో పాటు పశువుల పెంపకందారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

నడిచెరువులో బావులు..

చెరువులోని నీరు తూముల ద్వారా ఆయకట్టు రైతులు వాడుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ చెరువు దగ్గర మాత్రం చెరువు పైభాగాన ఉన్న రైతులు యంత్రాల ద్వారా బావులు తవ్వించి పైపులైన్ ద్వారా తమ భూములకు నీరును పెట్టుకుంటున్నారు. చెరువు లోతట్టులో గతంలో గ్రామపంచాయతీ ప్రజల తాగునీటి కోసం రెండు బావులు తవ్వారు. ఇప్పుడు ఆ బావులు పోను మరో 6బావులను కొందరు తవ్వించుకొని నీటిని వినియోగిస్తున్నారు.

చేపల పెంపకందారులు డీలా..

రామలింగప్ప చెరువు నీటిని ఆధారంగా చేసుకొని ఆ పంచాయతీ పరిధిలోని మత్స్యశాఖ సొసైటీ ఆధ్వర్యంలో చేపల పెంపకం చేపడుతున్నారు. చెరువులో బావుల తవ్వకాల ద్వారా నీటి నిల్వలు అడుగంటడంతో తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని చేపల పెంపకందారులు పేర్కొంటున్నారు. ఈ విషయంపై జిల్లాస్థాయి అధికారులకు సైతం ఫిర్యాదు చేసినట్లు సొసైటీ సభ్యులు తెలుపుతున్నారు.

మూగజీవాలను తీసుకెళ్లాలన్నా భయమే..



ఊరికి దగ్గరగా చెరువు ఉంది. గేదెలను మేపిన తర్వాత తాగునీటికి తీసుకెళ్లామంటే అందులో ఉన్న గోతులు, బావుల వల్ల భయంగా ఉంటుంది. ఎండాకాలంలో పశువులు తాగేందుకు నీళ్లు లేకుండా చెరువులో తవ్విన బావులను పూడ్చివేయించాలి.

-ఎల్లంకి చంద్రయ్య, పశువుల కాపరి

అనుచిత వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న వివిధ సంఘాల నాయకులు

నెహ్రూసెంటర్: బీసీ నేత డాక్టర్ చెరుకు సుధాకర్‌పై నల్లగొండ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి గుగులోతు హరినాయక్, ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి గుగ్గిళ్ల పీరయ్య, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుగులోతు భీమానాయక్ అన్నారు. డాక్టర్ చెరుకు సుధాకర్‌పై ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెరుకు సుధాకర్ కుమారుడికి ఫోన్ చేసి చంపేస్తామంటూ, ఆస్పత్రిని కూల్చేస్తామంటూ కోమటిరెడ్డి వెంకటరెడ్డి బెదిరింపులకు పాల్పడడం సరికాదన్నారు. ఆయనను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఏర్పాటులో క్రియాశీలక పాత్ర పోషించిన సుధాకర్‌పై బెదిరింపులకు పాల్పడడం అహంకారానికి నిదర్శనమన్నారు. దళిత, గిరిజన, ఆదివాసీలు డాక్టర్ చెరుకు సుధాకర్‌కు అండగా ఉన్నామని, ఆయనపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెరుమాండ్ల గుట్టయ్య, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు సంపంగి రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ



సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంవీ రమణ

డోర్నకల్: మండలంలోని వెన్నారం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎంవీ రమణ ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో వక్తలు సర్వాయి పాపన్న సేవలను కొనియాడారు. అంతకు ముందు విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని సర్పంచ్ బోయినపల్లి వెంకన్న ఆధ్వర్యంలో గౌడ కులస్తులు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పొడిశెట్టి కమలారామనాథం, కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర చైర్మన్ బాలగాని బాలరాజుగౌడ్, అఖిల భారత గౌడసంఘం జిల్లా అధ్యక్షుడు కల్లెపు సతీష్‌గౌడ్, నాయకులు గౌని వెంకన్న, ఐలి వెంకన్న, బోడపట్ల వెంకన్న, బోయినపల్లి లక్ష్మణ్, బోయిన నాగేశ్వర్‌రావు, డాక్టర్ నారగోని రాంప్రసాద్, అమరగాని వెంకన్న, గాదె నాగేశ్వర్‌రావు, మేకపోతుల వెంకన్న పాల్గొన్నారు.

ఆహ్వానం పలుకుతున్న పూల చెట్లు



ఇంటి వెనుక పూలతోట





పూల మొక్కల పెంపకం కోసం ప్రత్యేక ఏర్పాట్లు

పూల పొదరిల్లు

డోర్నకల్: మున్సిపాలిటీ పరిధిలోని బంకట్‌సింగ్ తండాకు చెందిన మంగీలాల్ పూల మొక్కల పెంపకంపై మక్కువతో తన ఇంటిని నర్సరీగా మార్చాడు. ఇంటి కారిడార్, డాబా పైభాగం, ఇంటి వెనుక భాగం, కాంపౌండ్ వాల్ చుట్టూ పలు రకాల పూల మొక్కలను పెంచుతున్నాడు. పూలమొక్కలను సేకరించి ఖాళీ బకెట్లలో నాటి వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాడు. మంగీలాల్‌తో పాటు కుటుంబ సభ్యులు ప్రతిరోజు మొక్కలకు నీరు పట్టడంతో పాటు పరిసరాలను శుభ్రపరుస్తున్నారు. ఇంటి చుట్టూ పూలమొక్కలతో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుందని, నిత్యం రంగురంగుల మొక్కలు కళ్లకు కనిపిస్తుండడంతో మనసు ప్రశాంతంగా ఉంటుందని మంగీలాల్ కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

క్లుప్తంగా

చంపుతామని బెదిరించిన వారిపై కేసు నమోదు

మహబూబాబాద్‌ రూరల్‌ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరుకు చెందిన చిందుకూరి ఏడుకొండలును హైదరాబాద్‌కు చెందిన నూనావత్‌ భూపాల్‌ నాయక్‌, మరికొంతమంది కలిసి హత్యచేసి చంపుతామని బెదిరించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని టౌన్‌ సీఐ వై.సతీష్‌ ఆదివారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ ఎదుట హ్యాపీ స్టే ఇన్‌ లాడ్జీని నువ్వు ఎందుకు కొనుగోలు చేశావని ఏడుకొండలును కిసాన్‌ పరివార్‌ సంస్థ నిర్వాహకులు భూపాల్‌ నాయక్‌, మరికొంతమంది కలిసి చంపుతామని బెదిరించారన్నారు. దీంతో అతడు తనకు ప్రాణభయం ఉందని పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేయగా టౌన్‌ ఎస్సై విజయరాంకుమార్‌ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని పేర్కొన్నారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

ఖిలావరంగల్‌: ఓ మైనర్‌ బాలికను అత్యాచారయత్నానికి యత్నించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్‌ ముస్క శ్రీనివాస్‌ తెలిపారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం.. వరంగల్‌ రైల్వేగేట్‌ ప్రాంతంలోని ఓ కాలనీకి చెందిన మైనర్‌ బాలికను అదే ప్రాంతంలో వెల్డింగ్‌ పనిచేస్తున్న వ్యక్తికి మధ్య పరిచయం ఏర్పడింది. బాలిక అతడితో తరుచూ మాట్లాడటంతో ఒంటరిగా ఉన్న ఆ బాలికపై అత్యాచారయత్నానికి యత్నించాడు. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు తెలుపగా తల్లి సహకారంతో మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఆదివారం పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎదురెదురుగా రెండు కార్లు ఢీ



ప్రమాదానికి గురైన కారును పరిశీలిస్తున్న స్థానికులు

ఖిలా వరంగల్‌: ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొనడంతో ఓ మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం ఉదయం వరంగల్‌ గవిచర్ల క్రాస్‌ రోడ్డు సమీపంలో జరిగింది. బాధితులు, స్థానికుల కథనం ప్రకారం హనుమకొండ జిల్లా ఆత్మకూర్‌ మండలం గుడెప్పాడు గ్రామానికి చెందిన మహబూబీ.. కేసముద్రం మండల కేంద్రంలో జరిగిన బంధువుల ఫంక్షన్‌కు వెళ్లి కారులో తిరిగి గుడెప్పాడుకు బయల్దేరారు. ఈక్రమంలో వరంగల్‌ గవిచర్ల క్రాస్‌రోడ్డు సమీపానికి రాగానే కారును ఎదురుగా వస్తున్న మరో కారును బలంగా ఢీకొట్టింది. దాంతో కారులో ప్రయాణిస్తున్న మహబూబీకి తీవ్ర గాయాలై రక్తస్రావమైంది. క్షతగాత్రురాలిని స్థానికులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి మిల్స్‌కాలనీ పోలీసులు చేరుకుని వివరాలు సేకరించినట్లు తెలిసింది.

మహిళల అభ్యున్నతికి సీఎం కృషి

- 8న కేటీఆర్‌ పర్యటనను విజయవంతం చేయాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్‌ శాఖ మంత్రి దయాకర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి

తొర్రూరు: మహిళల అభ్యున్నతికి సీఎం కేసీఆర్‌ కృషి చేస్తున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్‌ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం డివిజన్‌ కేంద్రంలో ఎర్రబెల్లి చారిటబుల్‌ ట్రస్టు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ రంగాల్లో విశేష కృషి చేస్తున్న మహిళలను మంత్రి సత్కరించారు. ఎర్రబెల్లి చారిటబుల్‌ ట్రస్ట్‌ చైర్‌పర్సన్‌ ఉషాదయాకర్‌రావుతో కలిసి మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌ మహిళా సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు స్త్రీ నిధి పథకం ద్వారా రూ. 18 వేల కోట్ల రుణాలు అందించామన్నారు. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్‌ కల్పించే బిల్లు తేవాలని అసెంబ్లీ తీర్మానం చేసి పంపిందని, కేంద్రం మాత్రం నేటికీ మహిళా రిజర్వేషన్‌ బిల్లును ఆమోదించలేదన్నారు.

కేటీఆర్‌ పర్యటనను విజయవంతం చేయాలి

ఈ నెల 8న రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ తొర్రూరుకు రానున్నారని, మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని మంత్రి దయాకర్‌రావు కోరారు. మంత్రి కేటీఆర్‌ పర్యటన నేపథ్యంలో సభాస్థలి, హెలీప్యాడ్‌, పార్కింగ్‌ స్థలాలను మంత్రి పరిశీలించారు. ఏర్పాట్లపై కలెక్టర్‌ శశాంక, ఎస్పీ శరత్‌చంద్రపవార్‌, అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. 20 వేల మందితో బహిరంగ సభ నిర్వహించనున్నామన్నారు. ఇందులో భాగంగా మున్సిపాలిటీలోని పలు అభివృద్ధి పనులను మంత్రి కేటీఆర్‌ ప్రారంభించనున్నారని మంత్రి ఎర్రబెల్లి తెలిపారు. 500 మంది మహిళలకు కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు కేటీఆర్‌ చేతుల మీదుగా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ మంగళపల్లి రామచంద్రయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్‌, గ్రామీణాభివృద్ధి కమిషన్‌ రాష్ట్ర డైరెక్టర్‌ లింగాల వెంకటనారాయణగౌడ్‌, ఎర్రబెల్లి చారిటబుల్‌ ట్రస్టు కోఆర్డినేటర్‌ పంజా కల్పన, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్‌ నాగవాణి, ఏఎంసీ చైర్‌పర్సన్‌ పసుమర్తి శాంత, పెద్దవంగర ఎంపీపీ ఈదురు రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.



కేటీఆర్‌ పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్‌ శశాంక, ఎస్పీ శరత్‌ చంద్ర పవార్‌తో మాట్లాడుతున్న మంత్రి

ఎండు గంజాయి పట్టివేత



నిందితుల అరెస్ట్‌ వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ జితేందర్‌రెడ్డి



నిందితుల అరెస్ట్‌ చూపుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

- మొబైల్‌ ఫోన్‌, ఆటో స్వాధీనం
- ఇద్దరు పరార్‌, ముగ్గురు అరెస్ట్‌
- వివరాలు వెల్లడించిన టాస్క్‌ఫోర్స్‌ ఏసీపీ జితేందర్‌రెడ్డి

ఖిలావరంగల్‌ : అక్రమంగా నిల్వ చేసి ఇతరులకు విక్రయించేందుకు ఆటోలో తరలిస్తున్న 1.200 కిలోగ్రాముల ఎండు గంజాయి, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టాస్క్‌ఫోర్స్‌ ఏసీపీ జితేందర్‌ రెడ్డి తెలిపారు. ఆదివారం టాస్క్‌ఫోర్స్‌ సీఐ కె.శ్రీనివాస్‌రావు, ఎన్‌.వెంకటేశ్వర్లులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ కేసు వివరాలు వెల్లడించారు. వరంగల్‌ శివనగర్‌ ప్రాంతం ఏసీరెడ్డినగర్‌ చెందిన ములుగు వినయ్‌, పోచమ్మమైదాన్‌ వాసవికాలనీకి చెందిన జన్ను ప్రశాంత్‌, వరంగల్‌ డాక్టర్‌ కాలనీ ఫేస్‌–1, సీపీఎం హట్స్‌, గౌతంనగర్‌కు చెందిన షేక్‌ ఫరాజ్‌, శివనగర్‌లోని సాయిబాబాలేన్‌కు చెందిన పాకాల సాయి, ఏసీరెడ్డినగర్‌కు చెందిన ములుగు వికాస్‌లు ముఠాగా ఏర్పడ్డారు. వీరు శివనగర్‌కు చెందిన సాయి, విక్కీల నుంచి కొనుగోలు చేసిన ఎండు గంజాయిని సేవిస్తూ ఇతరులకు విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం అందింది. ఈమేరకు ఆదివారం సాయంత్రం ఖిలావరంగల్‌ పెట్రోల్‌ బంక్‌ జంక్షన్‌లో టాస్క్‌ఫోర్స్‌ సీఐ వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన ఆటోను క్షుణ్ణంగా తనిఖీ చేయగా అందులో 1.200 కిలోగ్రాముల ఎండు గంజాయి లభించింది. పాకాల సాయి, ములుగు వికాస్‌ ఇద్దరు పరారు కాగా వినయ్‌, జన్ను ప్రశాంత్‌, షేక్‌ ఫరాజ్‌ను అరెస్టు చేసి వారి నుంచి గంజాయి, ఆటో, సెల్‌ఫోన్‌ స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో టాస్క్‌ఫోర్స్‌ ఎస్సై వడ్డెబోయిన లవన్‌కుమార్‌, ఎండీ నిస్సార్‌ పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి కేసులో ముగ్గురి అరెస్ట్‌

కాజీపేట: గంజాయికి అలవాటు పడిన ముగ్గురు యువకులను ఆదివారం అరెస్ట్‌ చేసి ఒక కిలో ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్‌ గట్ల మహేందర్‌రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్‌ స్టేషన్‌ ఆవరణలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ ప్రధాన రహదారిపై ఎస్సై ప్రమోద్‌ కుమార్‌ వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా కనబడగా పోలీసులను చూసి పరార్‌ కావడానికి ప్రయత్నించారు. యువకుల కదలికలను కనిపెట్టిన ఎస్సై నిందితులను వెంటాడి పట్టుకోగా కిలోఎండు గంజాయి లభించిందన్నారు. వైఎస్సార్‌ నగర్‌ కాలనీకి చెందిన గనిపాక సాయికృష్ణ, బల్లి మధు, టేకులగూడెం గ్రామానికి చెందిన కొట్టె రాజశేఖర్‌ను అరెస్ట్‌ చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సై మాచర్ల శ్వేత, చిట్టిబాబు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌, తదితరులు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌
- బీజేపీ ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

ఎంజీఎం/వరంగల్‌: రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్‌ ఎంపీ బండి సంజయ్‌ అన్నారు. ఆదివారం హన్మకొండలో మహిళలపై కొనసాగుతున్న అత్యాచారాలతో పాటు ప్రీతి ఘటనకు నిరసనగా వరంగల్‌ పోచమ్మమైదాన్‌ నుంచి కేఎంసీ వరకు బీజేపీ ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వేలాది మంది విద్యార్థులు, పార్టీ కార్యకర్తలతో కలిసి బండి సంజయ్‌ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలపై కొనసాగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలకు నిరసనగా సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 'నిరసన దీక్ష' చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, హన్మకొండ, వరంగల్‌ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, కొండేటి శ్రీధర్‌, పార్టీ నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావులతో కలిసి భద్రకాళీ దేవాలయం ప్రధానం ద్వారం ముందు మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో పూటకో అత్యాచారం, రోజుకో హత్య జరుగుతున్నా సీఎం కేసీఆర్‌ స్పందించడం లేదన్నారు. తెలంగాణలో గత ఏడాదితో పోలిస్తే 11 శాతం నేరాలు పెరిగాయన్నారు

ప్రీతికి ఘన నివాళి

వరంగల్‌: ఇటీవల ర్యాగింగ్‌తో మృతి చెందిన కేఎంసి విద్యార్థిని డాక్టర్‌ ప్రీతికి ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు జాటోతు హుస్సేన్‌ నాయక్‌ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.ప్రీతి మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌ మాట్లాడుతూ విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌ను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు పూర్తిగా వైఫల్యం చెందారని అన్నారు. కేసీఆర్‌ పాలనలో బీఆర్‌ఎస్‌ మద్దతుంటే క్రిమినల్స్‌ ఏం చేసినా చెల్లుతుందని ప్రీతి ఘటన నిరూపిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు, బ్యానర్ల తొలగింపుపై నేతల ఆగ్రహం



ఎన్‌డీఆర్‌ఎఫ్‌ సిబ్బందితో బీజేపీ నేతల వాగ్వాదం

వరంగల్‌/ఎంజీఎం: మెడికో ప్రీతి ఆత్మహత్య చేసుకున్న మెడికోకు సంతాపం తెలుపుతూ ఆదివారం సాయంత్రం పోచమ్మమైదాన్‌ జంక్షన్‌ నుంచి కేఎంసీ వరకు చేపట్టిన కొవ్వొత్తుల ర్యాలీకి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ వస్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లను గ్రేటర్‌ కార్పొరేషన్‌కు చెందిన డీఆర్‌ఎస్‌ సిబ్బంది తొలగించారు. ఈక్రమంలో ఫ్లెక్సీలు తొలగిస్తున్న సిబ్బందితో నాయకులు వాగ్వాదానికి దిగారు. పోచమ్మమైదాన్‌ జంక్షన్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్‌ తూర్పు బీజేపీ ఇన్‌చార్జ్‌ కుసుమ సతీష్‌ మాట్లాడుతూ బీజేపీ అంటే తూర్పు ఎమ్మెల్యేకు భయం పట్టుకుందని, బండి సంజయ్‌ అంటే రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు వణుకు పుడుతోందని ఆరోపించారు.

ఫేర్‌వెల్‌ వేడుకల్లో 'ఘర్షణ'

- మద్యం తాగిన విద్యార్థులు... చితకబాదిన అధ్యాపకులు

హసన్‌పర్తి: ఫేర్‌వెల్‌ వేడుకల్లో ఓ ఘటన ఘర్షణకు దారితీసింది. నగరంలోని భీమారం ప్రాంతానికి చెందిన ఓ ప్రైవేట్‌ కళాశాల యాజమాన్యం స్థానికంగా ఉన్న ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఫెయిర్‌వెల్‌ వేడుకలు నిర్వహించింది. ఓ వైపు వేడుకలు కొనసాగుతుండగా మరోవైపు పరిసర ప్రాంతంలో కొంత మంది విద్యార్థులు మద్యం సేవించడం ప్రారంభించారు. దీంతో విద్యార్థుల మధ్య మాటామాట పెరిగి ఘర్షణకు దారితీసినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న అధ్యాపకులు అక్కడికి వెళ్లి వారిని మందలించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కొంతమంది విద్యార్థులు అధ్యాపకులపై తిరిగబడినట్లు తెలిసింది. దీంతో అధ్యాపకులు వారిని చితకబాదారు.



అధ్యాపకులతో మాట్లాడుతున్న పోలీసులు

పోలీసులకు సమాచారం..

ఫంక్షన్‌హాల్‌లో గొడవ జరుగుతున్నదనే సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకున్నారు. గొడవకు దారి తీసిన కారణాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు కౌన్సెలింగ్‌ ఇచ్చారు. ఇదిలా ఉండగా తమ పిల్లలను అధ్యాపకులు కొట్టారనే సమాచారంతో తల్లిదండ్రులు ఫంక్షన్‌ హాల్‌కు చేరుకుని విషయాన్ని ఆరా తీశారు.

విశ్వ ఆయుర్వేద పరిషత్‌ అధ్యక్షుడిగా రాము



హన్మకొండ అర్బన్‌ : విశ్వ ఆయుర్వేద పరిషత్‌ ఉమ్మడి వరంగల్‌ జిల్లా అధ్యక్షుడిగా గోకారపు రాము ఎన్నికయ్యారు. నగరంలోని సామ జగన్మోహన్‌ భవన్‌లో ఆదివారం జరిగిన సంఘం ఉమ్మడి వరంగల్‌ జిల్లా స్థాయి సమావేశంలో నూతన కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా పోతు మహేష్‌, ఉపాధ్యక్షులుగా బి.సత్యప్రకాశ్‌, హెచ్‌.సునంద, ఎం.విజయ్‌కుమార్‌, పి.కిరణ్‌, కార్యదర్శులుగా కె.జగన్‌మోహన్‌చారి, ఎం.కృష్ణమూర్తి, సీహెచ్‌.అరుణ్‌, ఎల్‌.కరుణాకర్‌, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. జనగామ జిల్లా కన్వీనర్‌, కో కన్వీనర్‌గా పి.సత్యం, వి.అజయ్‌కుమార్‌, కె.రమ, ములుగు జిల్లాకు పి.కుమారస్వామి, బి.వరప్రసాద్‌, భూపాలపల్లి జిల్లాకు పి.తనుజ రాణి, జగదీష్‌ ఖన్నా, మహబూబాబాద్‌ జిల్లాకు ఆర్‌.శ్రీనివాస్‌, బి.రమ, బి.పార్థు, కె.చంద్రశేఖర్‌, హనుమకొండ జిల్లాకు ఎస్‌.వెంకటనారాయణ, గోపు రవీందర్‌, వరంగల్‌ జిల్లా కన్వీనర్‌, కో కన్వీనర్లుగా జె.సంపత్‌, పి.సంపత్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ విజయగణేష్‌రెడ్డి, టి.ప్రేమానందరావు, సమ్మిరెడ్డి, బి.కిషన్‌, వై.శ్రీనివాసులు, సుధ, శ్రీధర్‌, చంద్రశేఖర్‌ ఆర్య పాల్గొన్నారు.

పాలకు వెళ్లి అనంతలోకాలకు..

- ట్రాక్టర్‌ ఢీకొని వ్యక్తి దుర్మరణం
- మృతుడు శివనగర్‌ వాసి



ప్రదీప్‌చౌదరి (ఫైల్‌)

మామునూరు: మసక చీకట్లోనే గేదె పాలు తెస్తానని ఇంట్లో చెప్పి బైక్‌పై వెళ్లిన ఓ వ్యక్తి అనంత లోకాలకు వెళ్లాడు. ట్రాక్టర్‌ బైక్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం తెల్లవారుజామున గవిచర్ల రోడ్డుపై రాంగోపాలపురం బస్టాప్‌ వద్ద చోటు చేసుకుంది. మామునూరు పోలీస్‌స్టేషన్‌ పరిధి గుంటూరుపల్లికి చెందిన బొట్ల రమాదేవి, మల్లికార్జున్‌ దంపతుల కుమారుడు ప్రదీప్‌ చౌదరి(28) శివనగర్‌ పల్లవి ఆస్పత్రి ఏరియాలో భార్య, మూడేళ్ల కుమార్తెతో కలిసి నివాసం ఉంటూ పాలు,పెరుగు వ్యాపారం చేస్తున్నాడు. ప్రదీప్‌ చౌదరి బైక్‌పై ప్రతిరోజు ఉదయం 5 గంటలకు సంగెం మండలం గుంటూరుపల్లికి వెళ్లి గేదె పాలు తెస్తుంటాడు. రోజు మాదిరిగానే ఆదివారం ఉదయం 5 గంటలకు గుంటూరుపల్లికి బైక్‌పై బయల్దేరాడు. ఈ క్రమంలో గవిచర్ల రోడ్డుపై రాంగోపాలపురం బస్‌స్టాప్‌ వద్దకు చేరుకోగానే ఎదురుగా అతివేగంగా వస్తున్న ట్రాక్టర్‌ బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో ప్రదీప్‌చౌదరికి తలకు బలమైన తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రున్ని 108 వాహనంలో తరలించేందుకు ప్రయత్నిస్తుండగా మృతి చెందాడు. ప్రదీప్‌ మృతితో గుంటూరుపల్లి, శివనగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటన స్థలానికి మామునూరు ఎస్సై కృష్ణవేణి చేరుకుని వివరాలు సేకరించారు. మృత్యువుకు కారణమైన ట్రాక్టర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి తండ్రి మల్లికార్జున్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని రైల్వే ఉద్యోగి మృతి

కాజీపేట: కాజీపేట రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉంటూ రైల్వే డీజిల్‌ షెడ్‌లో టెక్నీషియన్‌-3గా పనిచేస్తున్న ఉద్యోగి ఆదివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఇన్‌స్పెక్టర్‌ గట్ల మహేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బీహార్‌ రాష్ట్రం నలంద జిల్లాకు చెందిన రవికుమార్‌ సిన్హా (26) దాదాపు 8 నెలల కింద వివాహం చేసుకున్నాడు. భార్య పుట్టింటికి వెళ్లడంతో ఒంటరిగానే ఇంట్లో ఉంటూ విధులకు హాజరై వెళ్లివస్తున్నాడు. ఏం జరిగిందో తెలియదు గానీ రవికుమార్‌ సిన్హా ఆత్మహత్యకు పాల్పడ్డాడని, భార్య, బంధువులు వచ్చిన తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించినట్లు సీఐ తెలిపారు.

డివైడర్‌ ఢీకొని ఒకరు..

మరిపెడ: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని మహబూబాబాద్‌ రోడ్డులోని డివైడర్‌ను ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో ఇద్దరు యువకులు బైకు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ క్రమంలో గుగులోతు లాలు(41) అక్కడికక్కడే మృతి చెందగా సుధాకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నర్సింహులపేట మండలం జయపురం గ్రామం శివారు దాసుతండాకు చెందిన వీరు మరిపెడలోని ఓ శుభకార్యానికి వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో బైక్‌ అదుపు తప్పి ఈ ప్రమాదం చోటు చేసుకుంది.



లాలు మృతదేహం

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి..



గుర్తుతెలియని యువకుడి మృతదేహం

సంగెం/కాశిబుగ్గ : ప్రమాదవశాత్తు రైలునుంచి జారిపడి గుర్తుతెలియని యువకుడు మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సీహెచ్‌. పరశురాములు తెలిపారు. ఆదివారం ఉదయం వరంగల్‌–విజయవాడ డౌన్‌ లైన్‌లో 391/22–24 కిలోమీటర్‌ వద్ద చింతలపల్లి, ఎల్గూర్‌ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని రైలు నుంచి జారిపడడంతో 25 నుంచి 30 ఏళ్ల వయసు గల యువకుడు మృతి చెందాడన్నారు. మృతుడు బ్లూ కలర్‌ జీన్స్‌ ప్యాంట్‌ లేత గులాబీ రంగు ఫుల్‌ షర్ట్‌ దానిపై బ్లూ కలర్‌ నైలాన్‌ జాకెట్‌ ధరించి ఉన్నాడు. నలుపురంగు తల వెంట్రుకలు, గడ్డం, మీసాలు గుండ్రని ముఖం, ఎరుపురంగు ఐదున్నర అడుగుల ఎత్తు కలిగి ఉన్నాడన్నారు. మృతునివద్ద బ్లాక్‌ కలర్‌ గ్లోనీ కంపెనీ ఫోన్‌ అందులో ఎన్‌సెల్‌ సిమ్‌, నేపాల్‌ రూ.20 నోట్‌ దొరికినట్లు తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదన్నారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరచినట్లు తెలిపారు. మృతునికి సంబంధించిన వ్యక్తులు ఎవరైనా తెలిస్తే వరంగల్‌ రైల్వే ఎస్సై 9866330257, 9440627532 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి..



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

దోర్నకల్‌ : మండల శివారులో చేపలవేటకు వెళ్లి ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఖమ్మం రూరల్‌ మండలం కాసిరాజుగూడెం శివారు రేకులతండాకు చెందిన దారావత్‌ కృష్ణ(46) మండలంలోని ముల్కలపల్లి శివారులోని ఆకేరువాగులో ఆదివారం సాయంత్రం చేపల వేటకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతుడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎస్సై శ్యాంసుందర్‌ను వివరణ కోరగా మృతుడు చేపల వేటకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు సమాచారం అందిందన్నారు. మృతదేహం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఘటన జరిగిన ప్రదేశం దోర్నకల్‌ మండల పరిధిలో ఉండటంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

మహాముత్తారం: పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని బోర్లగూడెంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ..మండలంలోని బోర్లగూడెంకు చెందిన గుంజ సరోజన (55) భర్త వెంకటయ్య మద్యానికి బానిసై కుటుంబ బాధ్యత మరిచి పట్టించుకోకపోవడంతో పలు మార్లు భర్తను మందలించింది. అయినప్పటికీ భర్తలో మార్పు రాకపోవడంతో కుటుంబపోషణ భారమై మనస్తాపానికి గురైంది. దీంతో శనివారం రాత్రి ఇంటి వద్ద పురుగుల మందు తాగగా గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయింది. కుమారుడు మహేష్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్‌ తెలిపారు.

గుర్తూరులో వివాహిత..



అనూష మృతదేహం

తొర్రూరు రూరల్‌ : ఓ వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని గుర్తూరులో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై సతీష్‌ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కాసర్ల అనూష (30) పెళ్లి చేసుకొని ఏళ్లు గడుస్తున్నా సంతానం కావడం లేదని మనస్థాపం చెంది ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. విచారణ చేపడుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

ఖిలా వరంగల్‌: వరంగల్‌ ఫోర్ట్‌రోడ్డు ఏకశిలానగర్‌కు చెందిన 21 ఏళ్ల యువతి అదృశ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్‌ ఫోర్ట్‌రోడ్డులోని ఏఎస్‌ఎం మహిళా డిగ్రీ కళాశాల రోడ్డుకు చెందిన యువతి సుమశ్రీ కాలేజీకి వెళ్లివస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిపోయిందన్నారు. సాయంత్రం తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించడం లేదు. దీంతో ఆదివారం సాయంత్రం యువతి తండ్రి శ్రీనివాస్‌ ఫిర్యాదు మేరకు మిస్సింగ్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.